క్లుప్తంగా

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

బొబ్బిలి: పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఏఐఎస్ఎఫ్(ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్) ఆవిర్భావ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా జనరల్ సెక్రటరీ మున కాల శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ నేతలు కొంతమంది కలిసి ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. 1936లో ఇదేరోజున ఈ సంఘం ఏర్పాటైందని, అప్పట్లో సాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించిందని, ఇప్పుడు విద్యార్థుల హక్కుల కోసం పోరాటం చేస్తోందని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నేతలు ప్రవీణ్, గౌరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరిశీలన



బొబ్బిలిలో రోడ్ల దుస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డుతో పాటు గొల్లపల్లి, పూల్‌బాగ్, దాడితల్లి ఆలయ రోడ్లను ఎమ్మెల్యే బేబీనాయన సోమవారం పరిశీలించారు. అనంతరం రోడ్ల స్థితిగతులు, రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణానికి అయ్యే వ్యయం వంటి వివరాలను మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. రోడ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన



విద్యార్థులతో పుస్తకాలు చదివించి, అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో ఎరకయ్య

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో బి.ఎరకయ్య సోమవారం సందర్శించారు. పాఠశాల రికార్డులతో పాటు ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు తనిఖీ చేశారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. నాణ్యమైన విద్యాబోధన అందించాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యా ప్రగతిపై దృష్టిసారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు.

ఆరోగ్య తనిఖీలు



విద్యార్థి ఆరోగ్యంపై ఆరాతీస్తున్న వైద్యాధికారి అసిరినాయుడు

రేగిడి: మండలంలోని చాటాయివలస, ఉప్పర్నాయుడువలస గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు ప్రతీ విద్యార్థి ఆరోగ్యం గురించి తెలుసుకుని, మెరుగైన ఆరోగ్యానికి పలు సూచనలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, భోజనానికి ముందు తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: పట్టణ పరిధిలోని అమ్మవారి కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పి.శ్రీనివాసరావును పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ సోమవారం పరామర్శించారు. శ్రీనివాసరావు తల్లి సరోజిని ఇటీవల మృతి చెందగా ఈ విషయం తెలుసుకున్న రాజేష్.. ఉదయం ఆ కాలనీకి వెళ్లి, బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. ఆయన వెంట పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి రూరల్: మండలంలోని నౌపడ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం ఒక వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడిని విజయనగరం జిల్లా చీపురుపల్లి గ్రామం కస్పా వీధికి చెందిన మోనంగి మోహనరావు(56)గా రైల్వే పోలీసులు గుర్తించారు. ఈ వ్యక్తి వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడని తెలుస్తోంది.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయండి

- సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదనరావు



తెర్లాం: మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదనరావు



బొబ్బిలి రూరల్: నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో రవికుమార్



రామభద్రపురం: శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని చెబుతున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

తెర్లాం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లంతా కృషి చేయాలని ఎంపీడీవో మధుసూదనరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లకు మూడు రోజుల పాటు ఇస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య పనుల నిర్వహణ, ఈ–పంచాయతీ, అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికల తయారీ తదితర అంశాలపై సర్పంచ్‌లకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాభివృద్ధి ప్రణాళికల తయారీపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏవో డీవీ అప్పారావు, ఈవోపీఆర్డీ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: అందరి సహకారంతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో పి.రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణకు హాజరైన ఆయన.. ఈ శిక్షణలో నేర్చుకునే విషయాలు గ్రామాభివృద్ధికి దోహదపడతాయని, ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఈ శిక్షణకు హాజరవ్వాలని కోరారు. అనంతరం అందరితో నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాల వినియోగం ద్వారా కలిగే దుష్పలితాలను వివరించి, ప్రతిఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు హాజరైన ఆమె.. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామాల్లో ప్రజోపయోకర పనులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు అవసరం..

మెంటాడ: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు అవసరమని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు హాజరైన ఆయన.. పారిశుధ్యం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీబాయి, ఈవోపీఆర్డీ విమలకుమారి, మెంటాడ పంచాయతీ కార్యదర్శి రామనాథ్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్సను కలిసిన శంబంగి



ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్సతో మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీగా నామినేషన్ వేసిన ఆయన ఘనవిజయం సాధించి, ప్రజాసేవలో తరించాలని ఆకాంక్షించారు. అనంతరం వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని కలిసి, పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొత్స కాశినాయుడు, తెర్లాం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రంగనాథన్ సేవలు మరువలేనివి



రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి, తదితరులు



రామభద్రపురం: రంగనాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ సత్యవాణి, పాఠకులు

తెర్లాం: గ్రంథాలయ ఉద్యమకారుడు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ సేవలు మరువలేనివని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి కొనియాడారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో రంగనాథన్ 132వ జయంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం లైబ్రేరియన్ మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేసిన వారు చాలా మంది ఉన్నారని వారిలో ప్రముఖులు రంగనాథ్ ఒకరు అన్నారు. గ్రంథాలయాల ద్వారా ప్రజలను విజ్ఞానవంతులను చేసి, చైతన్యం చేయాలన్న సదుద్దేశ్యంతోనే వారు గ్రంథాలయోద్యమాన్ని నడిపారన్నారు. వారి కృషి ఫలితంగా వచ్చిన గ్రంథాలయాలు సమాజాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయని, అటువంటి గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెర్లాం–5 అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి, నెమలాం హైస్కూల్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయోద్యమకారుడు ఎస్.ఆర్(షియాలీ రామామృత) రంగనాథన్ జయంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి లైబ్రేరియన్ సత్యవాణి, పాఠకులు, విద్యార్థులు కలిసి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.

మాదకద్రవ్యాల నిర్మూలనలో యువతే కీలకం



నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: మాదకద్రవ్యాల నిర్మూలనలో యువతే కీలకం కావాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో సోమవారం సమావేశమైన ఆయన అందరితో నషా విముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఎక్కడా మాదకద్రవ్యాల వాడకం, రవాణా లేకుండా చూడాలని కోరారు. ముఖ్యంగా యువత చెడువ్యసనాల బారినపడి జీవితం నాశనం చేసుకుంటున్నారని, ప్రతీ పంచాయతీలో డ్రగ్స్ రహిత సమాజం నిర్మించడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని యువతను భాగస్వాములుగా చేయాలన్నారు.

వాహన తనిఖీలు



వాహనదారుడి పెండింగ్ చలాన్లు పరిశీలిస్తున్న ఎస్‌ఐ రవికిరణ్

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డు జంక్షన్‌లో పోలీసులు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ వై.రవికిరణ్ సిబ్బందితో కలిసి అటువైపుగా వస్తున్న వాహనదారులను ఆపి, వారి లైసెన్స్‌తో పాటు వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహనాల ధ్రువపత్రాలు తప్పసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. అలాగే పెండింగ్ చలాన్లు చెల్లించాలని తెలిపారు.

ప్రతి ఇంటిపై త్రివర్ణపతాకం ఎగురవేయాలి

రాజాం సిటీ: దేశస్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన మహానుభావులను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై త్రివర్ణపతాకం ఎగురవేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.స్వప్నహైందవి అన్నారు. సోమవారం స్థానిక రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి త్రివర్ణ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత అధిక సంఖ్యలో పెడదోవ పడుతున్నారని, చెడు మార్గాన్ని విడనాడి దేశనాయకుల అడుగుజాడల్లో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాజాం అధ్యక్షులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, ఎస్ఎస్ఎస్ పీఓ భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



రాజాం టౌన్ సీఐకి వినతిపత్రం అందిస్తున్న వికాస తరంగిణి సభ్యులు

రాజాం సిటీ: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని వికాస తరంగిణి రాజాం శాఖ సభ్యులు కోరారు. వినాయక చవితి ఉత్సవాలు దగ్గర పడుతున్న నేపథ్యంలో మట్టి విగ్రహాలే వాడి, పర్యావరణ హితం కోరుకునేలా అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ స్థానిక మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, టౌన్, రూరల్ సీఐలు మోహనరావు, ఉపేంద్రరావులకు సోమవారం వినతిపత్రాలు అందించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వాడడం ద్వారా పర్యావరణం కలుషితమవుతోందని, వాటికి బదులుగా మట్టి విగ్రహాలు అందరూ వాడేలా చూడాలన్నారు. అలాగే నిమజ్జనోత్సవాల్లో డీజేలు వాడకంతో శబ్దకాలుష్యం ఏర్పడుతోందని, వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. రాజాంను కలుషిత కోరల నుంచి కాపాడేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిరసన



ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఫ్యాప్టో నేతలు



బొబ్బిలి: ఎంఈవో లక్ష్మణరావుకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

రామభద్రపురం: మండల వనరుల కేంద్రం వద్ద ఫ్యాప్టో నేతలు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. ఎన్నికల్లో గెలవడం కోసం జీవో నంబర్ 117ను రద్దు చేస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత మర్చిపోయారని ఇలా మోసం చేయడం తగదన్నారు. జీవో నంబర్ 117ను రద్దు చేసి, 53వ నంబర్ జీవో ప్రకారం ఉపాధ్యాయులకు పని సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కార్యక్రమాలు నిర్వహించడం ప్రభుత్వపు దుర్మార్గపు చర్యగా భావిస్తున్నామన్నారు. ఇప్పటికైనా అనాలోచిత నిర్ణయాలు ఆపాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంఈవో తిరుమలప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నేతలు కె.విజయగౌరి, జేసీ రాజు, వి.ప్రసన్నకుమార్, ఎ.నాగభూషణరావు, బి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు సోమవారం సమావేశమై, ఉపాధ్యాయుల సర్దుబాటులో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అనంతరం జీవో నంబర్ 117 రద్దు చేయాలని, జీవో నంబర్ 53 ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని కోరుతూ ఎంఈవో చల్లా లక్ష్మణరావుకు వినతిపత్రం అందజేశారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 16వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ తెలిపారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 16న కూనాయవలస, జన్నివలస గ్రామాల్లో, 17న ఆమిటి, లోచర్ల, 20న గంగన్నపాడు, చాజయ్యపేట, 22న అంట్లవార, లింగాపురం, 23న కుసుమూరు, నందబలగ, 24న ఎం.ఆర్ అగ్రహారం, కుమ్మరిపేట, 25న గొలుగువలస, సీతారాంపురం, 27న కొరటాం, సతివాడ, 28న అప్పలంపేట, బూరిపేట, కొల్లివలసల, 29న కవిరాయునివలస, సీతారాంపురం, 30న రంగప్పవలస, వెలగవలస, 31న డి.గదబవలస, పుల్లేరువలస, సెప్టెంబర్ 2వ తేదీన పణుకువలస, సోమిదవలస, 3న పెరుమాళి, టెక్కలివలస, 4న వి.చిన్నయ్యపేట, చుక్కవలస, 5న వెంకటాపురం, కాగాం, 6న పెదపాలవలస, అరసబలగ, 9న చినపాలవలస, పూనువలస, 10న నెమలాం, ఆర్.గదబవలస, 11న సుందరాడ, ఎన్.బూర్జవలస, 12న నందిగాం, జె.కొత్తవలస, 13న తెర్లాం, 14న ఉద్దవోలు గ్రామాల్లో సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 14వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీఆర్‌వో పనితీరుపై తహసీల్దార్ మండిపాటు



వీఆర్‌వో లలితను మందలిస్తున్న తహసీల్దార్ శ్రీను

బొబ్బిలి రూరల్: మండల కేంద్రంలోని ఐటీఐ కాలనీ సచివాలయ వీఆర్‌వో లలిత పనితీరుపై తహసీల్దార్ శ్రీను మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి నెలనెలా జీతం తీసుకుంటున్నది ప్రజలకు సేవ చేసేందుకేనని, ఈ విషయం గుర్తుంచుకుని పనిచేయాలని మందలించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమానికి అదే సచివాలయం పరిధిలోని అరిసెల ఈశ్వరమ్మ వెళ్లి, తమ కొడుకు చదువు నిమిత్తం అవసరమయ్యే ఈడబ్ల్యూసీ ధ్రువపత్రం కావాలని నాలుగు రోజులుగా అడుగుతున్నా సదరు వీఆర్‌వో ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. సర్టిఫికెట్ కావాలంటే ఆస్తిపత్రాలు తీసుకురావాలని గట్టిగా చెబుతోందని వాపోయింది. దీంతో తహసీల్దార్.. ఆ వీఆర్‌వోను పిలిపించి, విచారించారు. దరఖాస్తు నింపి తీసుకురమ్మన్నానని ఆమె తెలుపగా, చదువురాని వారు దరఖాస్తు ఎలా నింపుతారని, ఆమెకు కావాల్సిన సర్టిఫికెట్ వెంటనే ఇవ్వాలని ఆదేశించారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి



దశపత్ర కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: లాభసాటి వ్యవసాయానికి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ కిరణ్‌కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని దేవుదళ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తే పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తాయన్నారు. నేల కూడా సారవంతమవుతుందన్నారు. అనంతరం దశపత్ర కషాయం తయారీని వివరించారు. స్థానికంగా లభించే 10 రకాల ఆకులు, పొగాకు, పచ్చిమిర్చి, వెల్లుల్లి, శొంఠిపొడి వంటి వాటిని తీసుకుని, ముద్దగా చేయాలన్నారు. దానిని ఓ పాత్రలో వేసి వేడి చేయాలని సూచించారు. దానిని 20 లీటర్ల గోమూత్రంతో కలిపి, నిల్వచేసి ఆ తర్వాత పంటపై పిచికారీ చేస్తే పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్లు సోకవన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయాధికారి ప్రవీణ, యూనిట్ ఇన్‌చార్జి గౌరీశ్వరరావు ఐసీఆర్‌పీలు శ్రీదేవి, శ్రీలత, గోవిందమ్మ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి



పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశమైన ఎంపీడీవో పలు సూచనలు చేశారు. ఇటీవల జరిగిన శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాల పరంగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. ముఖ్యంగా పారిశుధ్యం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామీణులు ఎటువంటి ఇబ్బందులు పడకుకండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

• ఆటల పోటీల సందడి



రేగిడి: దస్తర్ ఆట ఆడుతున్న విద్యార్థులు



వంగర: కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

స్వాతంత్ర్య దినోత్సవానికి రెండు రోజులు మాత్రమే ఉండడంతో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటల పోటీల సందడి నెలకొంది. ఏటా ఆగస్టు 15వ తేదీన క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో అన్నిచోట్ల పోటీలు ముమ్మరం చేయడంతో ప్రతీ పాఠశాలలో పండగ వాతావరణం కనిపిస్తోంది. విద్యార్థులు కూడా ఉత్సాహంగా ఆటలు ఆడి, క్రీడాస్ఫూర్తి కనబరుస్తున్నారు.

– తెర్లాం, రేగిడి, వంగర



తెర్లాం–5 అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల కప్పగెంతులాట

ఆర్థిక సాయం

విజయనగరం టౌన్: స్థానిక శాంతినగర్ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ ఎం.లక్ష్మణరావుకు విజయనగరం డ్రైవర్స్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు సోమవారం ఆర్థిక సాయం అందించారు. కొద్దిరోజుల కిందట జరిగిన ప్రమాదంలో లక్ష్మణరావుకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ పోషణ భారంగా మారడంతో తోటి ఆటోడ్రైవర్లంతా రూ.27,604, నిత్యావసర సరుకులను అందజేశారు.